
సాక్షి
గుంటూరు
బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



పేకాటరాయుళ్లు అరెస్టు


యడ్లపాడు: కోట గ్రామంలోని గోపీనాథ ఆలయ ప్రాంగణంలో పేకాట జరుగుతుందని తెలిసి ఎస్‌ఐ టి.శివరామకృష్ణ దాడి చేశారు. ముగ్గురిని అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,58,320 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 2,43,308 క్యూసెక్కులు వదులుతున్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవం



కారెంపూడి: ఎస్‌ఎస్‌పీ కాలనీ వినాయకుడి గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం నిమజ్జన ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఆదివారం అమ్మవారి ఆలయం మూసివేత



దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి ఆలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 2:30 గంటల నుంచి మూసివేయనున్నట్లు ఈవో కె.సునీల ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి సోమవారం సంప్రోక్షణ అనంతరం ఉదయం 9 గంటల నుంచి అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

బాలికను వేధించిన కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

గుంటూరు జిల్లా కోర్టు తీర్పు

రాజుపాలెం: బాలికను వెంటపడి వేధిస్తున్న యువకుడికి ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా కోర్టు తీర్పు వెలువరించినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండలంలోని అనుపాలెంకు చెందిన పిడతల శ్యామ్ 2021లో 10వ తరగతి చదువుతున్న బాలికను ప్రతి రోజూ వెంటబడుతున్నాడని తండ్రి ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి ఎస్‌ఐ అమీర్ కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సత్తెనపల్లి డీఎస్పీ ఎమ్ హనుమంతరావు పర్యవేక్షణలో రాజుపాలెం ఎస్‌ఐ కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో సాక్షులను హాజరు పరుచగా విచారించిన పీవోసీఎస్‌వో గుంటూరు జిల్లా కోర్టు జడ్జి షమీపర్విన్ సుల్తాన్‌బేగం శిక్షను విధించారు.

మెడికల్ విద్యార్థినికి చేయూత



మంగళగిరి టౌన్ : ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన వెనిగళ్ళ సాహిత్యకు పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం చేయూతనిచ్చింది. మంగళగిరి నగర పరిధిలోని దామర్ల నాంచారమ్మ ప్రాంగణంలో ఉన్న పట్టణ పద్మశాలీయ బహూత్తమ కార్యాలయంలో విద్యార్థిని సాహిత్యకు 70 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ విద్యార్థినిలో ప్రతిభను ప్రోత్సహించడం సంఘం ముఖ్య ఉద్దేశమని అన్నారు. విద్యలో మరింత రాణిస్తూ ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి, సామాజిక వర్గానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు దామర్ల కుబేర స్వామి, గుత్తికొండ ధనుంజయరావు, రామనాథం పూర్ణచంద్రరావు, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బార్ల నిర్వహణకు రీ నోటిఫికేషన్

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): గుంటూరు జిల్లాలో ఉన్న 110 మద్యం బార్ల నిర్వహణకు గత నెలలో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇందులో కేవలం 43 మద్యం బార్లకు మాత్రమే లాటరీ తీశారు. మిగిలిన వాటికి దరఖాస్తులు రాకపోవడంతో తిరిగి మంగళవారం రీ నోటిఫికేషన్ జారీ చేస్తూ ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి 14 వరకు దరఖాస్తుల స్వీకరణ, 15న లాటరీ ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు.

రూ.6.05 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



గుంటూరు కొరిటిపాడు రెడ్ల బజార్‌లోని వాయుపుత్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ద్వితీయ గణపతి మహోత్సవాల్లో స్వామివారి లడ్డూను మంగళవారం వేలం నిర్వహించగా, కొరిటిపాడుకు చెందిన కొండమడుగుల సింహాద్రిరెడ్డి అత్యధికంగా రూ.6,05,116లకు దక్కించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



పొన్నూరులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



తూములూరు ప్రధాన కూడలిలో ఉన్న మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



గుంటూరు రైలుపేటలో పేదలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న పార్టీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా

మహానేతా మనసా స్మరామి

జిల్లావ్యాప్తంగా ఘనంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

- డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘననివాళి
- సేవా కార్యక్రమాలు నిర్వహించిన పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మరణం లేని మనిషి దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు కొనియాడారు. మహానేత వైఎస్సార్ వర్ధంతి పురస్కరించుకుని బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కోర్టు, అమరావతి రోడ్డు, ముత్యాలరెడ్డినగర్, కొరిటెపాడు, స్వామి థియేటర్ సెంటర్, లక్ష్మీనగర్, ఆదర్శనగర్, హౌసింగ్ బోర్డుతోపాటు, పలు ప్రాంతాల్లో పర్యటించి వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. పార్టీ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ పేదల గుండెకు భరోసా కల్పించి, ఎంతటి ఖర్చు అయినా ఆరోగ్యశ్రీ ద్వారా వారికి మేలు చేకూర్చిన ఆరోగ్య ప్రదాత వైఎస్సార్ అని కీర్తించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు నియోజకవర్గంలో..

వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. పొన్నూరు రూరల్ మండలం మామిళ్లపల్లిలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం, పొన్నూరు రూరల్ మండలం మునిపల్లె గ్రామం, పొన్నూరు రూరల్ మండలం పచ్చలతాడిపర్రు, పొన్నూరులోని పార్టీ కార్యాలయంలో, పొన్నూరులోని అంబేడ్కర్ సెంటర్ వద్ద, పొన్నూరు రూరల్ మండలం వెల్లలూరు, మంచాల, చేబ్రోలు, నారాకోడూరు, పెదకాకాని గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కార్యకర్తలు, నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

మంగళగిరి నియోజకవర్గంలో..

తాడేపల్లి రూరల్, తాడేపల్లి టౌన్, మంగళగిరి టౌన్, మంగళగిరి రూరల్, దుగ్గిరాలలో దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పాల్గొని డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల స్థాయి, గ్రామస్థాయి నేతలు, అభిమానులు పాల్గొన్నారు.



గుంటూరు రెడ్లబజార్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

తాడికొండ నియోజకవర్గంలో..

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు తెలిపారు. మంగళవారం డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పేరేచర్ల డొంక రోడ్డులో వద్దగల డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లూరు వంశీకృష్ణ, పేరేచర్ల గ్రామ అధ్యక్షుడు షేక్ సుభాని, ముత్యాల బాలస్వామి, గండికోట రసూలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెనాలి నియోజకవర్గంలో..

తెనాలి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కొల్లిపరలో బొంతు వారి గుడి వద్ద వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కొల్లిపర మాయాబజార్ సెంటర్‌లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తూములూరు గ్రామంలో సెంటర్లోని హైస్కూల్ దగ్గర వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. తూములూరు అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. వల్లభపురం గ్రామంలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో శివకుమార్ పాల్గొని వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో..

ప్రత్తిపాడు, ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ మాతృమూర్తి మణెమ్మ, తనయుడు కౌశిక్ కిరణ్‌లు పాల్గొని డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రూరల్ మండలంలో నల్లపాడు, చల్లావారిపాలెం, మల్లవరం గ్రామాల్లో ఎంపీపీ ఇంటూరి పద్మావతి, అంజిరెడ్డిలు పాల్గొని డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.



గుంటూరు రెడ్ల బజారులో వైఎస్సార్ విగ్రహానికి పూల వర్షం

గుంటూరు నగరంలో..

పేదల ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా కీర్తించారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి పురస్కరించుకుని తూర్పు నియోజకవర్గంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గడ్డిపాడు, రొట్టెలబడి, సుద్దపల్లి డొంక, మాయాబజారు, రామిరెడ్డితోట, ఆనందపేట, డీఎస్‌నగర్, నల్లచెరువు, మూడుబొమ్మలసెంటర్, బృందావన్ గార్డెన్స్, ఆదర్శనగర్, లక్ష్మీనగర్, సంగడిగుంట, ఏటుకూరు, రైలుపేట, సంజీవయ్యనగర్, సీతానగర్, మంగళదాస్‌నగర్, శ్రీనగర్, స్వర్ణభారతికాలనీ, లక్ష్మారెడ్డి నగర్‌లలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నగర, జిల్లా కమిటీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



తాడికొండలో నివాళులర్పిస్తున్న మోదుగుల, డైమండ్ బాబు



ఏటుకూరు బైపాస్‌లోని ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బలసాని మణెమ్మ, కౌశిక్ కిరణ్ తదితరులు



మంగళగిరి బస్టాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

రూ.1.25 కోట్లతో గణనాథుడికి అలంకారం



గుంటూరు రత్నగిరి కాలనీలో కొలువైన వినాయక విగ్రహాన్ని మంగళవారం కరెన్సీ నోట్లతో అలంకరించారు. రత్నగిరి కమిటీ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో గణనాథుడిని రూ.1.25 కోట్ల విలువైన కరెన్సీతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు నగేష్, కొణతం శ్రీనివాసరావు, రవి పాల్గొన్నారు.

– నగరంపాలెం (గుంటూరు వెస్ట్)

గణనాథుడికి 117 రకాల ప్రసాదాలు

మంగళగిరి టౌన్: మంగళగిరి ఇప్పటం రోడ్డులో లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడికి సోమవారం రాత్రి 117 రకాల ప్రసాదాలు సమర్పించారు. స్థానిక చిన్నారులకు, మహిళలకు మ్యూజికల్ చైర్స్, స్పూన్ అండ్ లెమన్, క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. చిన్నారుల నృత్య, కోలాట ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులు భారీ సంఖ్యలో గణపతిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



జాతీయ లోక్‌అదాలత్‌పై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తులు, పాల్గొన్న చిట్ ఫండ్ కంపెనీల ప్రతినిధులు, పలు ఇనిస్టిట్యూషన్స్ ప్రతినిధులు

గుంటూరు లీగల్: ఈనెల 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి ఆదేశాల మేరకు అన్ని ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్, చిట్ ఫండ్ కంపెనీల ప్రతినిధులతో ఒకటవ అదనపు జిల్లా కోర్టులో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాల్గో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్ బాబు, ఒకటో అదనపు జిల్లా జడ్జి వి.ఎ.ఎల్.సత్యవతి, మూడో అదనపు జిల్లా జడ్జి సి.హెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు, రెండో అదనపు జిల్లా జడ్జి వై.నాగరాజ పాల్గొని అన్ని ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ ప్రతినిధులు, చిట్‌ఫండ్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. సివిల్, క్రిమినల్ కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ చేసుకోవడానికి తగు సలహాలు సూచనలు చేశారు. ఇందులో భాగంగా గోకుల్ చిట్ ఫండ్ కంపెనీ చెక్ అమౌంట్‌లో పది శాతం తగ్గించుకొని కేసును పరిష్కరించుకొనేందుకు అంగీకరించారు. ఇది కక్షిదారులకు మంచి అవకాశమని గోకుల్ చిట్ ఫండ్ వారితో కక్షిదారులు సంప్రదించి వారి కేసులను సత్వరమే రాజీ చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారానికి తగు సలహాలు ఇచ్చి, సూచనలు చేశారు.

జిల్లా కోర్టులో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి


గుంటూరు జిల్లా కోర్టులో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, న్యాయవాదులు

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా కోర్టులో వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్పాహార విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పాల్గొని మహానేత చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు సిడి భగవాన్, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి, మాజీ గవర్నమెంట్ ప్లీడర్లు పోకల వెంకటేశ్వర్లు, ఎంవీ సుబ్బారెడ్డి, మాజీ ఏజీపీ సౌభాగ్య లక్ష్మి, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, కాసు వెంకటరెడ్డి, వాసం సూరిబాబు, వజ్రాల రాజశేఖర్ రెడ్డి, మాతంగి శ్రీకాంత్, కేవీ రమణారెడ్డి, సోమసాని ఝాన్సీ, బడి మంజుల, గేర వెంకట సుబ్బారావు, బొడ్డు కోటేశ్వరరావు, బూదాటి సాగర్, లీగల్ సెల్ అధికార ప్రతినిధి సయ్యద్ బాబు, మాజీ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సుధాకర్ రెడ్డి, న్యాయవాదులు కృష్ణారెడ్డి, సుదర్శన క్రాంతి కుమార్ బొమ్మనబోయిన శ్రీనివాస్, నల్లక వెంకట వేణు, సురేష్, నగర యువజన విభాగం అధ్యక్షుడు ఏటి కోటేశ్వరరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదల మనిషి డాక్టర్ వైఎస్సార్



గుంటూరు రూరల్: మండలంలోని 41వ డివిజన్‌నందున్న అడవి తక్కెళ్ళపాడు గ్రామం, రాజీవ్ గృహకల్పలో జరిగిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో మాజీ హోంమంత్రి మేకతోటి సుచరిత పాల్గొని డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొప్ప మనసున్న మహారాజు, అపర భగీరథుడు, ఆరోగ్యశ్రీ ప్రదాత, ప్రజాసేవలోనే అశువులు బాసిన గొప్ప మహానీయులు మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అని కొనియాడారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామస్తులు మాజీ మంత్రిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి మేరి, వెంకట్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అమరావతిలో 'యూనివర్సిటీ ఆఫ్ టోక్యో' బృందం పర్యటన



తాడికొండ: జపాన్‌కు చెందిన 'యూనివర్సిటీ ఆఫ్ టోక్యో' బృందం మంగళవారం అమరావతిలో పర్యటించింది. తొలుత ఆ బృందం అమరావతిలోని శాఖమూరు పరిసర ప్రాంతాలను సందర్శించింది. అమరావతిలో యూనివర్సిటీ ఏర్పాటుకు అనుకూలమైన భూములను డ్రోన్, మ్యాప్ సహాయంతో సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ వివరించారు. రాజధాని అమరావతిలో విద్యా సంస్థల ఏర్పాటుకు అనుకూలమైన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని జపాన్ బృందం సంతృప్తి వ్యక్తం చేసినట్లు సీఆర్డీఏ అధికారులు తెలిపారు. అనంతరం బృందం అమరావతిలో విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లను సందర్శించింది. బృందంలో టోక్యో వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ యోషియుకి కజాయో, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ప్రొఫెసర్ హయాషి కయోరి, ప్రాజెక్టు స్పెషలిస్ట్ జేమ్స్ ఫెగాన్ ఉన్నారు.

పోలీసుల అదుపులో మట్కా నిందితులు

నరసరావుపేటటౌన్: నిషేధిత మట్కా నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నరసరావుపేటలో కొన్ని నెలలుగా టీడీపీ నాయకులు నిషేధిత లాటరీ, మట్కా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల కాలంలో యథేచ్ఛగా అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు రావటంతో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఇన్‌చార్జి డీఎస్పీ కె.హనుమంతరావు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. పదిరోజులుగా నరసరావుపేటలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి మట్కా జూదం నిర్వహిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

ఆర్‌ఓబీకి ముందే ఆర్‌యూబీ నిర్మించాలి

- ప్రజారవాణాకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- నష్టపరిహారం చెల్లించకుండానే భవన యజమానులను ఖాళీ చేయాలని బెదిరించడం అధికారులకు తగదు
- మీడియా సమావేశంలో బెటర్ శంకర విలాస్ ఫ్లయ్ ఓవర్ సాధన జేఏసీ కన్వీనర్ ఎల్.ఎస్.భారవి


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ ఎల్.ఎస్.భారవి

గుంటూరు ఎడ్యుకేషన్: శంకర్‌విలాస్ నూతన ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టే ముందుగానే ప్రజా రవాణాకు వీలుగా రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ని చేపట్టాలని బెటర్ శంకర్ విలాస్ ఫ్లయ్ ఓవర్ సాధన జేఏసీ కన్వీనర్ ఎల్ఎస్ భారవి డిమాండ్ చేశారు. మంగళవారం గుంటూరులోని ఓ హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో భారవి మాట్లాడుతూ ఇటీవల జరిగిన నగరపాలకసంస్థ కౌన్సిల్ సమావేశంలో ఫ్లయ్ ఓవర్ నిర్మాణానికి ముందే ఆర్‌యూబీ నిర్మించాలని చేసిన తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపి ఆమోదింపచేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్‌యూబీ నిర్మాణానికి నిధులు తెచ్చిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆర్‌యూబీ నిర్మాణం దిశగా రైల్వేశాఖను ఒప్పించాలని కోరారు. శంకర్‌విలాస్ ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించే ఆర్నెల్ల పాటు బ్రిడ్జిపై వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగించవచ్చని జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రకటించిన రెండు నెలల వ్యవధిలోనే బ్రిడ్జి కూల్చివేత పనులు ప్రారంభించేశారని చెప్పారు.

■ బ్రిడ్జికి రెండు వైపులా కూల్చివేసిన ఆర్అండ్‌బీ శాఖాధికారులు రైల్వే పరిధిలోని బ్రిడ్జి కూల్చివేత పనులకు అనుమతుల కోసం తీరిగ్గా రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్లడం ముందుచూపు లోపించిన పనులకు నిదర్శనమన్నారు. అన్ని అనుమతులు తెచ్చిన తరువాతే బ్రిడ్జి కూల్చివేత, నిర్మాణ పనులు చేపట్టాల్సిన అధికార యంత్రాంగం రైల్వేబోర్డు అనుమతి కోసం పంపడం ద్వారా నూతన బ్రిడ్జి నిర్మాణాన్ని మరింతగా జాప్యం చేయడమేనన్నారు. బ్రిడ్జి నిర్మాణం కారణంగా నష్టపోతున్న భవన యజమానులకు చట్ట ప్రకారం నష్ట పరిహారాన్ని చెల్లించాలని హైకోర్టు స్పష్టంగా చెప్పడంతోపాటు స్టేటస్-కో విధించినప్పటికీ అధికార యంత్రాంగం ఖాతరు చేయకుండా ఏకపక్షంగా పనులు చేపడుతున్నారని ఆరోపించారు. హైకోర్టులో స్టే ఉండగానే రెండు రోజుల్లో భవనాలు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడమేంటని ప్రశ్నించారు. నగర ప్రజలపై గౌరవం లేని అధికారులు కనీసం హైకోర్టుపై గౌరవంతో ఆదేశాలను పాటించాలని కోరారు.

■ నగర ప్రజలతో పాటు నిర్మాణాలను కోల్పోతున్న యజమానుల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని అన్ని అనుమతులు తెచ్చుకుని బ్రిడ్జి కూల్చివేత, నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్‌యూబీ నిర్మాణానికి నిధుల గురించి ప్రజా ప్రతినిధులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆర్‌యూబీ నిర్మాణాన్ని రైల్వేశాఖ చేపడుతుందని చెప్పారు. సమావేశంలో షాప్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసరావు, కమల్‌కాంత్, అవధానుల హరి, వల్లూరి సదాశివరావు పాల్గొన్నారు.

డీఆర్‌ఎం కార్యాలయంలో సోలార్ ప్లాంట్

ప్రారంభించిన డీఆర్ఎం సుథేష్ణ సేన్



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ కార్యాలయంలో సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించడం సంతోషదాయకమని డివిజన్ డీఆర్ఎం సుథేష్ణ సేన్ అన్నారు. గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలంలో రోజు వారీ విద్యుత్ వినియోగంలో గణనీయమైన భారాన్ని తీర్చడానికి సోలార్ ప్లాంట్‌ను రూపొందించడం జరిగిందన్నారు. అనంతరం ప్లాంట్ నిర్మాణం కోసం కృషి చేసిన సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏడీఆర్ఎం ఎం.రమేష్‌కుమార్, డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎం.రవితేజ, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి సహకారం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి


స్వయం సహాయక బృందాల మహిళలతో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందే ఆర్థిక చేయూత ద్వారా మహిళలు ఆర్థికవృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ వెలుగు ఆధ్వర్యంలో జీవనోపాధి కార్యక్రమాలు, ప్రణాళిక అమలుపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాల జీవనోపాధి మెరుగుదల కోసం ప్రభుత్వ శాఖలు ప్రతిష్ట విధానాలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాయితీలతో అనేక పథకాలు అందిస్తుందన్నారు. జిల్లాలో వ్యవసాయం, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ, పరిశ్రమల శాఖలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ల ఏర్పాటుకు న్యాచురల్ ఫార్మింగ్ తదితర లాభదాయక వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసేలా క్షేత్ర స్థాయిలో అధికారులు మహిళలను ప్రొత్సహించాలన్నారు.

• డీఆర్‌డీఏ పీడీ పి.వి.విజయలక్ష్మి మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాల సభ్యులకు ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న స్కీమ్స్, సబ్సిడీ స్కీమ్‌లపై అవగాహన కల్పిస్తే జీవనోపాధి మరింత మెరుగు పరుచుకునే అవకాశం ఉంటుందన్నారు. కొలకలూరులో ఇండస్ట్రీయల్ పార్కు నిర్మించేందుకు దాత ఎకరం పొలం ఉచితంగా అందించారన్నారు. దీనిలో ఏపీఐఏసీ సహకారంతో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఫిరంగిపురంలో గతంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ మాదిరిగా మిగిలిన అన్ని మండలాల్లో కూడా మార్ట్‌లు ఓపెన్ చేస్తామన్నారు. డీఆర్‌డీఏ ద్వారా జిల్లాలో ఎస్‌హెచ్‌జీ మహిళలు అందించిన ఆర్థిక సహాయంతో సాంఘీక సంక్షేమ నిధికి రూ. 6.41 లక్షల నమూనా చెక్కును అధికారి గుణశీలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, నాబార్డు డీడీఎం శరత్‌బాబు, డ్వామా పీడీ శంకర్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి కారు బీభత్సం

- అతివేగంగా వెళ్తూ పలు వాహనాలను ఢీకొట్టిన వైనం
- గాయపడిన పలువురు వ్యక్తులు
- కారుపై పోలీస్ స్టిక్కర్


మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ రోడ్డులో ఐఓసీ వద్ద చెట్టును ఢీకొట్టి నిలిచిపోయిన కారు

తాడేపల్లి రూరల్: మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిలో ఉండవల్లి సెంటర్ నుంచి మంగళగిరి వెళ్లే మార్గంలో సోమవారం అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించి పలుచోట్ల ద్విచక్ర వాహనదారులను, ఒక సైక్లిస్టును ఢీకొట్టి చివరకు ఒక చెట్టును ఢీకొని నిలిచిపోయింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి ఉండవల్లి సెంటర్ నుంచి మంగళగిరి వెళుతున్న పోలీస్ స్టిక్కర్ కలిగి వున్న ఒక కారు సాయిబాబా గుడివద్ద విజయవాడ నుంచి మంగళగిరి వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ తోపాటు భార్యాభర్తలకు స్వల్పగాయాలయ్యాయి. కారు ఆపినట్లు ఆపి మళ్లీ అతివేగంగా వచ్చి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వద్ద సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని, ద్విచక్రవాహనంపై వెళుతున్న మరో వ్యక్తికి ఢీకొట్టడంతో వారు కింద పడ్డారు. కారు అదుపు తప్పి ఓ చెట్టును ఢీకొని ఆగిపోయింది. కారులో బెలూన్స్ సైతం ఓపెన్ అయ్యాయి. పూటుగా మద్యం సేవించి ఉన్న ఓ వ్యక్తి కారులోంచి దిగి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. కారుపై పోలీస్ అని స్టిక్కర్ ఉంది. ఇది పోలీసులకు చెందిన వాహనమా? లేక ఇంకెవరైనా పోలీస్ స్టిక్కర్ అతికించుకున్నారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి పోలీసులు గోప్యంగా వివరాలు సేకరిస్తున్నారు.

10న నాయుడమ్మ అవార్డు ప్రదానం


ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన రఘునాథబాబు

తెనాలి: తెనాలికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డును ఆయన జన్మదినమైన ఈనెల పదో తేదీన ప్రదానం చేయనున్నారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమ వివరాలను మంగళవారం సాయంత్రం ఇక్కడి కుమార్ పంప్స్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ నిర్వాహకులు ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆరోజు సాయంత్రం 4.30 గంటలకు జరిగే సభలో భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖలో ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్యదర్శిగా చేస్తున్న ఐఏఎస్ అధికారి నాగరాజు మద్దిరాలకు నాయుడమ్మ అవార్డును బహూకరిస్తామని ఫౌండేషన్ అధ్యక్షుడు యడ్లపాటి రఘునాథబాబు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీజిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా ఈ అవార్డును ప్రదానం చేస్తామని చెప్పారు. తోలు పరిశ్రమ, ఉత్పత్తుల రంగంలో భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిన ప్రజల శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ పేరిట బహూకరించే అవార్డు ప్రదానోత్సవ సభను జయప్రదం చేయాలని ఉపాధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం కోరారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, కె.అరవింద్, కె.నందకిశోర్ పాల్గొన్నారు.

చురుగ్గా రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

మంత్రి నాదెండ్ల మనోహర్


స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్

అత్తోట(కొల్లిపర): రాష్ట్రంలో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ చురుగ్గా కొనసాగుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. మంగళవారం గుంటూరు జిల్లా అత్తోటలో ఆయన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 1.46 కోట్ల మందికి స్మార్ట్ కార్డులు అందిస్తున్నట్లు చెప్పారు. చౌక దుకాణాల ద్వారా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ సరుకులు అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చని చెప్పారు. చౌక దుకాణాలను రానున్న రోజుల్లో మినీ మార్ట్‌లుగా తీర్చిదిద్దుతామన్నారు. వీటి ద్వారా తక్కువ ధరకే ఆర్గానిక్, నిత్యావసర సరుకులు అందిస్తామని చెప్పారు. రైతుల నుంచి ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామన్నారు. త్వరలో సబ్సిడీపై టార్పలిన్ పట్టాలు అందిస్తామన్నారు.

యూరియా అందడం లేదని రైతుల ఫిర్యాదు

తమకు యూరియా అందడం లేదని అత్తోట గ్రామ రైతులు మంత్రి నాదెండ్లకు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందిస్తూ.. ఎరువుల విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,600 గరిష్టం : రూ. 3,900

మోడల్ ధర రూ. 3,400



పసుపు ధరలు
(మంగళ వారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 1331

కొమ్ములు : 858 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,500	10,875	10,525

కాయలు : 473 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,500	10,875	10,525

మొత్తం అమ్మకాలు : 998.25 క్వింటాళ్లు

–దుగ్గిరాల

ఉన్నత విద్యారంగం ప్రైవేటు పరం

ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

లక్ష్మీపురం: భారతదేశంలో ఆర్థిక సంస్కరణ తర్వాత ఉన్నత విద్యారంగంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యారంగం పెద్దఎత్తున ప్రైవేటీకరణ జరుగుతుందన్నారు. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో 17 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఏర్పడ్డాయని, యూనివర్సిటీలో గత 15 ఏళ్లగా రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో అకడమిక్ క్షీణత ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలోని 280 ఇంజినీరింగ్ కాలేజీలు, 200 ఎంబీఏ, ఎంసీఏ కాలేజీలు, 150 బీ ఫార్మసీ కళాశాలలు ఉన్నాయని.. వీటిలో 90శాతం ప్రైవేట్‌లోనే ఉన్నాయన్నారు. వీటిలో విద్యా ప్రమాణాలపై తనిఖీ యంత్రాంగం లేదన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులు పనిచేయటం తగిన మౌలిక వసతులు లేకపోవడం వల్ల చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతుందని, పేద విద్యార్థులు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఫీజు రియింబర్స్‌మెంట్ సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్ ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి భావనారాయణ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ ,జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, సహాయ కారదర్శి పవన్ కుమార్, యశ్వంత్ కమిటీ సభ్యులు సౌమ్య, అమత, సింధు, హర్షిత, సాహితి, విద్యార్థులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	53,093
అమ్మకాలు	50,840
నిల్వ	9,971

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-14,200
నంబరు-5	10,000-13,400
341	10,000-15,300

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,300
నంబరు-5	10,000-13,500
341	11,000-15,500
4884	10,000-13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్-1	10,000 - 15,400
సంగీ బాడిగ 5531	10,000 - 14,600
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	6,200 - 7,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్-1	10,000 - 15,300
సంగీ బాడిగ 355	10,000 - 14,500
దువనూర్ డీలక్స	10,500 - 13,500
తాలు	5,400 - 7,500

–కొరిటిపాడు (గుంటూరు)

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారులు మృతి



ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకులు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేరికపూడి గ్రామానికి చెందిన ఆర్.వెంకటేశ్వర్లు(70), కుమారుడు భార్గవ్(23)లు మంగళవారం ద్విచక్రవాహనంపై పెట్రోలు బంకు వద్దకు బయలు దేరారు. మేరికపూడి గ్రామం వద్దకు చేరుకోగానే గుంటూరు నుంచి నరసరావుపేటకు వెలుతున్న ఆర్టీసీ బస్సు వెనకభాగం ద్విచక్రవాహనం హ్యాండిల్‌కు తగిలింది. దీంతో వాహనం అదుపుతప్పి రహదారిపై పడిపోవడంతో భార్గవ్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేశ్వర్లుకు తీవ్రగాయలు కావడంతో అతడిని చికిత్సకోసం నరసరావుపేట ప్రభుత్వవైద్యశాలకు తరలించి చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించడంతో గుంటూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ప్రమాదంపై పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డీజిల్ దొంగ అరెస్ట్

- లారీలో డీజిల్ దొంగిలిస్తుండగా పట్టుకున్న స్థానికులు
- టూటౌన్ పోలీసులకు అప్పగింత


పట్టుబడిన కాకాని యశ్వంత్

నరసరావుపేటటౌన్: ఆగి ఉన్న లారీల్లో డీజిల్ దొంగతనం చేస్తున్న యువకుడిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివసంజీవయ్య కాలనీకి చెందిన కాకాని యశ్వంత్ చిలకలూరిపేట రోడ్డు ముస్లిం శ్మశానవాటిక పక్కన గల పెట్రోల్ బంకు ఆవరణలో నిలిపి ఉన్న లారీలో తెల్లవారుజామున డీజిల్ దొంగతనం చేసేందుకు ప్రయత్నించాడు. గమనించిన పెట్రోల్ బంకు సిబ్బంది కేకలు వేయటంతో తన వెంట తెచ్చుకున్న ద్విచక్రవాహనం, 25 లీటర్ల రెండు క్యాన్‌లు వదిలి పరారయ్యాడు. రెండు గంటల తర్వాత మరో ద్విచక్ర వాహనంపై అతని స్నేహితుడితో కలిసి వచ్చి వదిలి వెళ్లిన వాహనాన్ని తీసుకెళ్లాడు. అప్పటికే యశ్వంత్ కోసం అక్కడ వేచి చూస్తున్న లారీ యజమానులు, పెట్రోల్ బంకు నిర్వాహకులు అతన్ని పట్టుకున్నారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ హైమారావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కొన్ని నెలలుగా లారీల్లో డీజిల్, బ్యాటరీలు అపహరణకు గురవుతున్నాయని లారీల నిర్వాహకులు పోలీసులకు వివరించారు. నిందితుడితోపాటు అతని స్నేహితుడిని అదుపులోకి తీసుకొని డీజిల్ దొంగతనం చేసేందుకు తెచ్చిన ప్లాస్టిక్ క్యాన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి

మంగళగిరి టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం... మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి(50), అతని భార్య సుజాత హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లేందుకు సోమవారం రాత్రి మంగళగిరి పట్టణ పరిధిలోని తెనాలి ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద బస్సు కోసం వేచి ఉన్నారు. అదే సమయంలో గుర్తు తెలియని తెల్ల రంగు కలిగిన ఓ వాహనం అతివేగంగా భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. బలమైన గాయాలు కావడంతో ఆయనను భార్య సుజాత ఎన్ఆర్ఐ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లింది. శ్రీనివాస రెడ్డిని పరీక్షించిన వైద్యులు మార్గంమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది.

టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక

నరసరావుపేట రూరల్: ఉమ్మడి గుంటూరు జిల్లా టెన్నికాయిట్ సీనియర్ స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక పోటీలు లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో ఇరు జట్లను ఎంపిక చేశారు. పురుషుల జట్టులో డి.కోటేశ్వరరావు, పి.ఆంజనేయులు(నకరికల్లు), ఆర్.సాయిగణేష్, వి.వీరతేశ్వర్ (శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్), మహిళల జట్టులో జె.సిరివల్లి, టి.నవ్య(కేజీబీవీ, నాదెండ్ల), బి.వైశాలి(నకరికల్లు), బి.రాజ్యలక్ష్మి (రాజుపాలెం)లు ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు ఈనెల 13, 14వ తేదీలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. పోటీలను అసోసియేషన్ అధ్యక్షుడు నిడికొండ జానకీరామయ్య పర్యవేక్షించారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా పి.తిరుపతిరావు, సిహెచ్ పుల్లయ్య, జి.ఝాన్సీరాణి, ఎస్.రాణి, పి.రమాదేవిబాయ్, లక్ష్మీతిరుపతమ్మలు వ్యవహరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

SPOKEN ENGLISH

■ స్పోకెన్ ఇంగ్లీష్ తెనాలిలో మీ ఇంటి వద్దకు వచ్చి ఇంగ్లీష్ స్పీకింగ్ స్కిల్స్, రైటింగ్ స్కిల్స్, కాంపిటేటివ్ ఇంగ్లీష్ నేర్పబడును. 75698 68826

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

WANTED

■ బాపట్ల జిల్లా ఇంకొల్లు గ్రామం నందు ప్రముఖ ట్రాక్టర్స్ మరియు ఇంప్లిమెంట్స్ షోరూం నందు పనిచేయుటకు అనుభవం కలిగిన అకౌంటెంట్స్ కావలెను. Ph: 9985157771

■ గుంటూరు సిటీలోని ప్రముఖ హాస్పిటల్‌కి హౌస్‌కీపింగ్ స్త్రీలు జీతం 10 వేలు & వార్డు బాయ్స్ జీతం 12 వేలు అర్జెంటుగా కావలెను. 12 గం॥ డ్యూటీ. ✆ 85209 77729, 96423 13999

■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ కంపెనీకి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ M/F కావలెను. Q: 12th above, జీతం: 13500+ ఇన్సెంటీవ్స్. 72055 83999

■ వాగ్దేవి ఇంటీరియర్స్ నందు జాబ్ చేయుటకు మార్కెటింగ్ టీమ్ అనుభవం గలవారు అర్జంటుగా కావలెను. అర్హత: డిగ్రీ. 7599999729

■ మంగళగిరి, తెనాలి ఏరియాలో పురుగు మందు కంపెనీలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అ:డిగ్రీ, జీ: 15000+3000. సంప్ర: 91214 69383

■ జిల్లాలో బ్యాంకుల్లో వర్క్ చేయుటకు అటెండర్స్, క్లర్క్స్, రికవరీ, క్యాష్ లోడింగ్, కం.ఆపరేటర్స్, క్యాషియర్స్, అసిస్టెంట్స్, జీ: 27000/-, Q: 10-డిగ్రీ. 8297349403

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 20K. Ph: 8977639662, 8977639663

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ఈ సెల్ నెంబర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించి ప్రతి స్పందించాల్సింది పాఠకులు. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు, పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.